


WWW.VIJAYAKERATAM.COM RNI: APTEL/2010/34724

# విజయ కెరటం

తెలుగు దినపత్రిక

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY




సెప్టెంబర్ 5 శనివారం 2026 | సంపుటి : 18 | సంచిక : 213 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

SATURDAY SEPTEMBER 5 2026 | VOL:18 | ISSUE: 213 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:MD. MaKsood Ahmed

## సోనియా గాంధీ పుస్తకానికి కొత్త పబ్లిషర్.. నవంబర్ 10న విడుదల


నవంబర్ 10న భారత్‌లో 'బిలాంగింగ్' విడుదల

పెంగ్విన్ ప్రచురణపై వచ్చిన వార్తలను సంస్థ ఖండన

పుస్తకంలో సోనియా వ్యక్తిగత, రాజకీయ ప్రయాణం

ఇందిర, రాజీవ్ గాంధీ హత్యల ప్రభావాన్ని ప్రస్తావించిన సోనియా

సోనియా గాంధీ రాసిన 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్'






(మిగతా 4వ పేజీలో..)

## కొండా దంపతుల డిమాండ్లు..? ఆ రెండు పార్టీలతో చర్చలు!

రెండు పార్టీల నేతలతో కొండా దంపతుల మంతనాలు

మంతనాలు శుక్రవారం రాత్రిలోపు కొలిక్కి వచ్చే అవకాశముందని చర్చ

కొండా సురేఖపై కాంగ్రెస్ నేతలు తీవ్రస్థాయిలో ఎదురుదాడి

నాయిని, సారయ్య, గుండు సుధారాణి విమర్శలు

వరంగల్ రాజకీయాలు వేడెక్కాయి. మాజీ మంత్రి కొండా సురేఖ దంపతుల చుట్టూ



(మిగతా 3వ పేజీలో..)

# తెలంగాణలో మంత్రివర్గ విస్తరణకు సన్నాహాలు

గవర్నర్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

ఖాళీ స్థానాలు భర్తీ చేసే దిశగా కదలికలు

వచ్చే ఎన్నికల్లో గెలుపు లక్ష్యం

**హైదరాబాద్ సెప్టెంబర్ 4 విజయ కెరటం ప్రతినిధి**

తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ, మార్పులు జరగనున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిసి మంత్రివర్గ సంబంధిత అంశాలపై చర్చించారు. ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేయడం, అవసరమైతే కొన్ని మార్పులు చేయడంతో పాటు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం సృష్టించే దిశగా ఈ విస్తరణను చూస్తున్నారు.

గవర్నర్ భేటీలో కీలక చర్చలు:

సీఎం రేవంత్ రెడ్డి తాజాగా గురువారం సాయంత్రం గవర్నర్‌ను కలిశారు. ఈ భేటీలో మంత్రివర్గంలోని ఖాళీ స్థానాలు, ఇటీవలి పరిణామాలు (మంత్రి కొండా సురేఖ తొలగింపు సిఫార్సు సహా) తదితర అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. గవర్నర్‌కు అధికారిక సిఫార్సులు సమర్పించి, అవసరమైన నిర్ణయాలు తీసుకునేందుకు ప్రభుత్వం

(మిగతా 2వ పేజీలో..)



## ట్రంప్ దృష్టిలో మోదీ అగ్రస్థానంలో ఉంటారు.. అమెరికా రాయబారి ఆసక్తికర వ్యాఖ్యలు!

మోదీని కలవడానికి ట్రంప్ ఆసక్తిగా ఉన్నారన్న సెర్గియో గోర్

డిసెంబర్‌లో జీ20 సదస్సు కోసం అమెరికా పర్యటనకు మోదీ

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం త్వరలో ఖరారయ్యే సూచనలు

500 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యం

భారత్ విశ్వసనీయ రక్షణ భాగస్వామి అన్న గోర్

జీ20 సదస్సు కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా వెళ్లనున్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య కీలక పరిణామాలు చోటుచేసుకునే



(మిగతా 2వ పేజీలో..)

## పేద విద్యార్థులకు అండగా కోమటిరెడ్డి.

**హైదరాబాద్ సెప్టెంబర్ 4 విజయ కెరటం ప్రతినిధి.**

పేదరికం అనేది విద్యకు ఆటంకం కారాదనే గొప్ప సంకల్పంతో, తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు ఎంతో మంది విద్యార్థులకు ఆశాకిరణంగా నిలుస్తున్నారు. ముఖ్యంగా ఆయన తన కుమారుడు ప్రతీక్ రెడ్డి జ్ఞాపకార్థం స్థాపించిన 'కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్' ద్వారా ఎందరో పేద విద్యార్థుల ఉన్నత చదువులకు, అందులోనూ వైద్య విద్య (వీదీదీూ) చదువుతున్న వారికి ఆర్థిక అండగా నిలుస్తూ స్ఫూర్తిదాయకమైన కథను లిఖిస్తున్నారు.ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు



(మిగతా 2వ పేజీలో..)

## కొండా సురేఖను తొలగించారు.. పొంగులేటి సంగతి ఏమిటి?: హరీశ్ రావు

రేవంత్ ను వ్యక్తిగతంగా విమర్శించారనే కొండా సురేఖపై వేటు వేశారన్న హరీశ్

22ఏ పేరుతో రైతులను పీడిస్తున్న పొంగులేటిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్న

భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నాడని మండిపాటు

తనను వ్యక్తిగతంగా విమర్శించారనే కారణంతోనే కొండా సురేఖను సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సురేఖపై చర్యలు తీసుకున్న రేవంత్... 22ఏ నిషేధిత భూముల పేరిట రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలను, రైతులను పట్టి పీడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డికి, పొంగులేటికి మధ్య ఉన్న

(మిగతా 2వ పేజీలో..)



## పెట్టుబడుల వేట.. వ్యక్తిగత అంశాలు: విజయ్ తొలి విదేశీ పర్యటనపై తమిళనాట చర్చ



సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి విదేశీ పర్యటన

ఈ నెల 10 నుంచి 16 వరకు బ్రిటన్ లో పర్యటించనున్న విజయ్

భార్య, కుమార్తెలను విజయ్ కలుస్తాడంటూ ప్రచారం

తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విజయ్ తన తొలి అధికారిక విదేశీ పర్యటనకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రానికి భారీగా పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఆయన ఈ నెల 10 నుంచి 16 వరకు బ్రిటన్ లో పర్యటించనున్నారు. లండన్‌లో జరిగే పలు కీలక పారిశ్రామికవేత్తల సమావేశాల్లో పాల్గొని ఉన్నత స్థాయి చర్చలు జరపనున్నారు. అయితే, ఈ పర్యటన కేవలం అధికారిక కార్యకలాపాలకే కాకుండా ఆయన వ్యక్తిగత జీవితానికి సంబంధించింది అంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇటీవల విజయ్ భార్య సంగీత విడాకుల పిటిషన్‌ను ఉపసంహరించుకోవడంతో

## దమ్ముంటే హరీశ్ రావు భార్య నాపై పోటీ చేయాలి: కవిత

తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానన్న కవిత

తాను సీఎం కావాలని కోరుకుంటున్నానని వెల్లడి

బీజేపీతో హరీశ్ రహస్య ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆరోపణ

తెలంగాణలో రాజకీయ ప్రత్యర్థుల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు తీవ్ర స్థాయికి చేరాయి. నూతనంగా తెలంగాణ రక్షణ సేన పార్టీని స్థాపించిన కల్వకుంట్ల కవిత... బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు లక్ష్యంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో ధైర్యముంటే హరీశ్‌రావు తన భార్యను తనపై పోటీకి దింపాలని బహిరంగ సవాల్ విసిరారు. తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించిన కవిత... హరీశ్‌రావు నేరుగా బరిలోకి రాకుండా తెరవెనుక రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు.



(మిగతా 4వ పేజీలో..)

విజయకేతనం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# ఆది నుంచి ధిక్కారమే ఆ జంట స్వరం...

తెలంగాణ రాజకీయాల్లో కొండా సురేఖ, కొండా మురళి దంపతులు ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వారి ప్రభావం దశాబ్దాలుగా కొనసాగుతోంది. పార్టీలు మారినా, పదవులు వచ్చినా వెళ్లినా... వారి చుట్టూ వివాదాలు, అసమ్మతి, ధిక్కార స్వరం ఎప్పుడూ ఉంటూనే ఉన్నాయి. తాజాగా మంత్రివర్గం నుంచి సురేఖ తొలగింపు ఈ ధోరణికి మరో ఉదాహరణగా నిలిచింది.

రాజకీయాల్లోకి

కొండా మురళి గీసుకొండ మండలం వంచనగిరికి చెందిన రైతు కుటుంబం నుంచి వచ్చారు. తెలుగుదేశం పార్టీలో కార్యకర్తగా మొదలై సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. తర్వాత కాంగ్రెస్‌లో చేరి స్వంత బలంతో నాయకుడిగా ఎదిగారు. ఆ రోజుల్లో వరంగల్‌లో ఆధిపత్య వర్గాల మధ్య ఒక బీసీ నాయకుడిగా నిలబడటం సాధారణం కాదు. కొండా సురేఖను కాలేజీ రోజుల్లోనే ప్రేమ వివాహం చేసుకుని రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. భర్త అడుగుజాడల్లో నడుస్తూ.. కొండా సురేఖ **1995**లో ఎంపీపీగా గెలిచి, **1999**లో శాయంపేట నుంచి ఎమ్మెల్యేగా అసెంబ్లీలోకి వచ్చారు. వైఎస్ రాజశేఖర రెడ్డి కాలంలో ఆమెకు మంత్రి పదవి దక్కింది.

పార్టీలు మారినా... వైఖరి మారలేదు

వీరి రాజకీయ ప్రయాణం తెలుగుదేశం, కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీ, టీఆర్ఎస్/బీఆర్ఎస్, మళ్లీ కాంగ్రెస్... ఇలా అనేక పార్టీల మీదుగా సాగింది. ప్రతి మార్పులోనూ వారు షరతులు పెట్టినట్లు, లేదా అధిష్టానంతో విభేదించినట్లు కనిపిస్తుంది. వైఎస్ మరణం తర్వాత జగన్‌కు మద్దతుగా నిలిచారు. తర్వాత టీఆర్ఎస్‌లో చేరి వరంగల్ తూర్పు నుంచి గెలిచారు. కేసీఆర్‌తో కూడా విభేదాలు వచ్చి మళ్లీ కాంగ్రెస్‌కు తిరిగి వచ్చారు. **2023**లో వరంగల్ తూర్పు నుంచి గెలిచి రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖలు చూశారు. గతంలో సొంత ప్రభుత్వంపైనే ధర్నా చేయడం, స్థానిక నాయకులతో తీవ్ర వివాదాలు, తెలంగాణ ఉద్యమ కాలంలోని కొన్ని ఘటనలు... ఇవన్నీ వారి రాజకీయ చరిత్రలో భాగమయ్యాయి. అదే సమయంలో వారిపై కేసులు, ఆరోపణలు కూడా వచ్చాయి.

తాజా పరిణామం -- కూతురి వ్యాఖ్యలు, మంత్రి పదవి పోవడం

**2026** ఆగస్టులో పరకాల నియోజకవర్గం విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికి మద్దతు తెలపడంతో వివాదం మొదలైంది. కొండా కుటుంబం తమ కూతురు సుస్మితా పటేల్‌ను అభ్యర్థిగా చూస్తోంది. సురేఖ జన్మదిన వేడుకల్లో సుస్మితా సీఎంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆ తర్వాత పార్టీలో క్రమశిక్షణా చర్యలు మొదలయ్యాయి. సురేఖ రాజీనామా చేయడానికి నిరాకరించడంతో సెప్టెంబర్ 3న ముఖ్యమంత్రి గవర్నర్‌కు సిఫార్సు చేసి ఆమెను మంత్రివర్గం నుంచి తొలగించారు.సురేఖ ఈ నిర్ణయాన్ని విమర్శిస్తూ, తనపై కుల, లింగ వివక్ష ఉందని, సీఎం బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేశారని ఆరోపించారు. కూతురు వ్యాఖ్యలకు తాను బాధ్యురాలిని కాదని, ఎమ్మెల్యేగా కొనసాగుతానని చెప్పారు.

ఇప్పుడు ఏం జరుగుతుంది?

వరంగల్ రాజకీయాల్లో కొండా దంపతుల ప్రభావం ఇంకా ఉంది. మద్దతుదారులు వారికి అండగా ఉన్నారు. అయితే పార్టీలో క్రమశిక్షణ, అధికార సమతుల్యత అనే అంశాలు ముందుకు వచ్చాయి. మంత్రి పదవి పోయినా, సురేఖ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. వారి రాజకీయ భవిష్యత్తు ఇప్పుడు కొత్త దశలోకి వెళ్లింది. కొండా దంపతులు ఎప్పుడూ రాజీపడని, సవాలు విసిరే నాయకులుగా కనిపిస్తారు. ఆ స్వభావమే వారిని గుర్తుంచుకునేలా చేస్తోంది. అదే సమయంలో పార్టీలో, ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఆ ధోరణి ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో తాజా సంఘటన చూపించింది. వరంగల్ రాజకీయాల్లో వారు కొత్త అధ్యాయానికి తెరలేపనున్నారు. రానున్న రోజుల్లో రాజకీయాల్లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో చూడాలి.

– సమీ, సీనియర్ జర్నలిస్ట్

# తెలంగాణలో మంత్రివర్గ విస్తరణకు సన్నాహాలు

మొదటి పేజీ తరువాయి)

సిద్ధమవుతోంది. ఇటీవల కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలని సీఎం సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. దీనితో ఒక స్థానం ఖాళీ అయింది. గతంలోనూ కొన్ని స్థానాలు ఖాళీగా ఉండటంతో మొత్తం ఖాళీలు భర్తీ చేసే అవకాశం ఉంది.

ఖాళీ స్థానాలు భర్తీ :

తెలంగాణ అసెంబ్లీ బలం ప్రకారం మంత్రివర్గం గరిష్టంగా 18 మంది (సీఎంతో సహా) ఉండవచ్చు. ప్రస్తుతం కొన్ని స్థానాలు ఖాళీగా ఉన్నాయి. గతంలో 2025 జూన్‌లో ముగ్గురు మంత్రులను చేర్చుకుని విస్తరణ చేసినప్పటికీ, ఇంకా కొన్ని స్థానాలు భర్తీ కాలేదు. ఇప్పుడు ఈ ఖాళీలను భర్తీ చేయడంతో పాటు, అవసరమైతే మరికొందరిని చేర్చుకునే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. సామాజిక న్యాయం, ప్రాంతీయ సమతుల్యత, వివిధ వర్గాల ప్రాతినిధ్యం దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని కాంగ్రెస్ హైకమాండ్ సూచనలు ఇచ్చినట్లు తెలుస్తోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది. కొత్త ముఖాలు, యువ నాయకులు, అనుభవజ్ఞులు -- అందరికీ అవకాశం కల్పించేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

వచ్చే ఎన్నికల్లో గెలుపు లక్ష్యం:

వచ్చే అసెంబ్లీ ఎన్నికలు (2028) దృష్టిలో పెట్టుకుని మంత్రివర్గాన్ని బలోపేతం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది. ప్రభుత్వ పనితీరును మెరుగుపరచడం, వివిధ వర్గాల మద్దతు సాధించడం, పార్టీ అంతర్గత ఐక్యతను పెంచడం వంటి ఈ లక్ష్యాలతో విస్తరణ జరగనుంది. హైకమాండ్‌తో సీఎం రేవంత్ రెడ్డి చర్చలు జరిపినట్లు సమాచారం.

రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ:

మంత్రి పదవుల కోసం పలువురు ఎమ్మెల్యేలు లాబీయింగ్ చేస్తున్నారు. కొందరు మంత్రుల పోర్ట్‌ఫోలియోల్లో మార్పులు, కొందరికి బయటకు వెళ్లాల్సి రావచ్చని కూడా ప్రచారం జరుగుతోంది. అయితే అధికారికంగా ఎలాంటి జాబితా ఇంకా ఖరారు కాలేదు. హైకమాండ్ ఆమోదం అనంతరమే తుది నిర్ణయాలు తీసుకుంటారు. తెలంగాణ రాజకీయాల్లో ఈ పరిణామాలు ఉత్కంఠను రేపుతున్నాయి. విస్తరణ ఎప్పుడు జరుగుతుంది?, ఎవరెవరికి అవకాశం దక్కుతుంది ? అనే విషయాలపై త్వరలోనే స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. ప్రభుత్వం, పార్టీ రెండింటినీ బలోపేతం చేసుకుని ప్రజల మద్దతును మరింత పెంచుకునే దిశగా కాంగ్రెస్ కదులుతోంది.

తెలంగాణ మంత్రివర్గం ప్రస్తుత స్థితి (సెప్టెంబర్ 2026 నాటికి):

తెలంగాణ అసెంబ్లీ బలం 119 సీట్లు కాబట్టి, రాజ్యాంగం ప్రకారం మంత్రివర్గం గరిష్టంగా 18 మంది (ముఖ్యమంత్రితో సహా) ఉండవచ్చు.

ప్రస్తుతం ఎంతమంది ఉన్నారు? ప్రస్తుత మంత్రుల సంఖ్య: 15 (ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సహా).సెప్టెంబర్ 3, 2026న మంత్రి కొండా సురేఖను తొలగించిన తర్వాత ఈ సంఖ్యకు చేరింది.

ఖాళీలు: 3.

2023 డిసెంబరులో 12 మంది ని క్యాబినెట్ లోకి తీసుకున్నారు.2025 జూన్‌లో ముగ్గురిని మందిని చేర్చుకున్నారు.2025 నవంబర్‌లో మహమ్మద్ అజరుద్దీన్ చేరారు.సెప్టెంబర్ 3.2026లో కొండా సురేఖ తొలగింపుతో ప్రస్తుతం 15కి తగ్గింది. ఇప్పుడు ఈ 3 ఖాళీలను భర్తీ చేయడం లేదా మరిన్ని మార్పులు చేయడం గురించి చర్చలు జరుగుతున్నాయి.

## పేద విద్యార్థులకు అండగా కోమటిరెడ్డి.

మొదటి పేజీ తరువాయి)

భరోసాకోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. తన కుమారుడి పేరు మీద నెలకొల్పిన ఈ ఫౌండేషన్ ద్వారా, ప్రతిభ ఉండి ఆర్థికంగా వెనుకబడిన ఎంతో మంది విద్యార్థుల ట్యూషన్ ఫీజులు, హాస్టల్ ఖర్చులు, పుస్తకాలు మరియు ఇతర అవసరాలకు ఆయన అండగా నిలుస్తున్నారు.ఎందరో పేద వైద్య విద్యార్థులకు చేయూతఇటీవల కాలంలో ఎంతో మంది పేద ఎంబీబీఎస్ విద్యార్థులు ఆయన సహాయం పొంది తమ డాక్టర్ కలను సాకారం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. కత్రోజు సుమలత: మెదక్ జిల్లా, కౌడిపల్లి మండలం సలబత్‌పూర్ గ్రామానికి చెందిన సుమలత అనే పేద విద్యార్థిని ఎంబీబీఎస్ సీటు సాధించినప్పటికీ ఆర్థిక ఇబ్బందుల వల్ల కూలీ పనులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చలించిపోయారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఆమె ఐదేళ్ల ఎంబీబీఎస్ చదువుకయ్యే ట్యూషన్ ఫీజు, బట్టలు, పుస్తకాలు సహా మొత్తం ఖర్చులను ఆయనే భరిస్తానని హామీ ఇచ్చారు. ఆమె భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా పేదలకు సేవ చేయాలని ఆకాంక్షించారు.పద్మశ్రీ: నల్లగొండలోని వీటీ కాలనీలో తల్లిదండ్రులతో కలిసి పూలు అమ్ముకునే పద్మశ్రీ అనే పేద దళిత విద్యార్థిని నార్కట్‌పల్లిలోని కామినేని మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఆమె పరిస్థితి తెలుసుకున్న మంత్రి, వెంటనే ప్రాథమిక ఆర్థిక సహాయం అందజేసి, ఆమె ఎంబీబీఎస్ మరియు పీజీ చదువులు పూర్తయ్యే వరకు తన పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు.కేవలం వైద్య విద్యకే పరిమితం కాకుండా, దేవరకొండకు చెందిన దినసరి కూలీల కుమార్తె పరిమళ, ఐఐటీ మద్రాస్‌లో చదువు పూర్తిచేసుకుని జర్మనీలో మాస్టర్స్ చేయడానికి వెళ్లేందుకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా పది లక్షల రూపాయల ఆర్థిక సాయం అందించారు. నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం ఆసుపత్రికి వెళ్లేందుకు ఏసీ బస్సులను కూడా ఆయన సమకూర్చారు."పేదరికం ప్రతిభకు అడ్డుకాకూడదు, చదువుకునే ప్రతి పేద విద్యార్థికి సహాయం అందాలి" అనేది ఆయన సిద్ధాంతం. తన కుమారుడిని కోల్పోయిన బాధను పక్కనపెట్టి, వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారి సేవా దృక్పథం, ఆయన స్థాపించిన ప్రతీక్ ఫౌండేషన్ చేస్తున్న కృషి సమాజానికి ఒక గొప్ప ఆదర్శం.

## ట్రంప్ దృష్టిలో మోదీ అగ్రస్థానంలో ఉంటారు.. అమెరికా రాయబారి ఆసక్తికర వ్యాఖ్యలు!

మొదటి పేజీ తరువాయి)



అవకాశాలు కనిపిస్తున్నాయి. మోదీని కలవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంతగానో కోరుకుంటున్నారని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. డిసెంబర్‌లో ఫ్లోరిడాలో జరిగే జీ20 సదస్సు కేవలం బహుపాక్షిక సమావేశాలకే పరిమితం కాకపోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు.ట్రంప్ దృష్టిలో మోదీ స్నేహితుడని, 35 మంది నేతలు వస్తే ఎవరిని కలవాలనుకుంటారని అడిగితే.. మోదీ ఆయన జాబితాలో అగ్రస్థానంలో ఉంటారని గోర్ చెప్పారు. 2020లో భారత పర్యటనను ట్రంప్ ఇప్పటికీ ఎంతో ఇష్టంగా గుర్తుచేసుకుంటున్నారని, వచ్చే ఏడాది ఆయన భారత్‌కు వచ్చే అవకాశం కూడా ఉందని సంకేతాలు ఇచ్చారు. అమెరికా-భారత్ సంబంధాలు ఇతర దేశాలు అసూయపడే రీతిలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై కూడా గోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు తర్వాత చర్చలను మళ్లీ కొనసాగిస్తున్నామని, ఒప్పందం "చాలా దగ్గర్లోనే ఉంది" అని తెలిపారు. రాబోయే కొన్ని నెలల్లో ఒప్పందం ఖరారవుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 240 బిలియన్ డాలర్లు ఉండగా.. దీన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచాలని మోదీ, ట్రంప్ లక్ష్యంగా పెట్టుకున్నారు.

### భారత స్థిరత్వం కీలకం

భారత్ ఆర్థికంగా బలపడటం అమెరికాకు కూడా ప్రయోజనకరమని గోర్ అన్నారు. మోదీ దేశానికి స్థిరత్వాన్ని అందిస్తున్నారని ప్రశంసించారు. అమెరికా కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెంచుతున్నాయని, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలు డేటా సెంటర్లు, ఏఐ కేంద్రాలు, ఔషధ రంగాల్లో విస్తరిస్తున్నాయని చెప్పారు. అమెరికాలోకి కొత్తగా 24 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడంలోనూ రాయబార కార్యాలయం సహకరించిందన్నారు.

### రక్షణ బంధం మరింత బలోపేతం

భారత్ తమకు విశ్వసనీయమైన రక్షణ భాగస్వామి అని గోర్ పేర్కొన్నారు. రక్షణ సంబంధాలు కేవలం ఆయుధాల కొనుగోళ్లకే పరిమితం కావని, పరస్పర విశ్వాసం కూడా కీలకమని చెప్పారు. జావెలిన్ క్షిపణి ప్రాజెక్టు, అపాచీ హెలికాప్టర్ల సరఫరా, మరిన్ని రక్షణ పరికరాలపై చర్చలను ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. అమెరికాతో భారత్ ఇతర దేశాల కంటే ఎక్కువగా సైనిక విన్యాసాలు నిర్వహిస్తోందన్నారు.

### వరుస పర్యటనలతో బంధం బలోపేతం

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అక్టోబర్‌లో మరోసారి భారత్‌కు రానున్నారు. తక్కువ వ్యవధిలో విదేశాంగ మంత్రి రెండుసార్లు భారత్‌కు రావడం అరుదని గోర్ అన్నారు. మరికొందరు అమెరికా కేబినెట్ మంత్రులు, మూడు రాష్ట్రాల గవర్నర్లు కూడా ఈ ఏడాది భారత్‌లో పర్యటించే అవకాశం ఉందన్నారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా వచ్చే నాలుగు నెలల్లో మూడుసార్లు అమెరికా వెళ్లే అవకాశం ఉందని తెలిపారు.

### క్వాడ్‌పై అమెరికా ప్రత్యేక ఆసక్తి

భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాతో కూడిన క్వాడ్ కూడా ఇరు దేశాల భాగస్వామ్యంలో కీలకమని గోర్ అన్నారు. మానవతా సాయం, విపత్తుల నిర్వహణ, సైనిక సహకారం, కృత్రిమ మేధ, డేటా సెంటర్లు, కీలక ఖనిజాల రంగాల్లో నాలుగు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. త్వరలో నాలుగు దేశాల నేతల శిఖరాగ్ర సమావేశం నిర్వహించేందుకు అమెరికా ఆసక్తిగా ఉందన్నారు.

## దమ్ముంటే హరీశ్ రావు భార్య నాపై పోటీ చేయాలి: కవిత

మొదటి పేజీ తరువాయి)

అవసరమని భావిస్తే రాజకీయాలను పక్కనపెట్టి ఆయన తన భార్యను బరిలోకి దించవచ్చని, ఆమె తనపై పోటీ చేసినా స్వాగతిస్తానని స్పష్టం చేశారు. గతంలో సిద్దిపేట నుంచి హరీశ్‌రావుపై పోటీ చేస్తానని చెప్పిన మాటను గుర్తు చేసిన కవిత... వచ్చే ఎన్నికల్లో తాను సిద్దిపేట లేదా బోధన్ నియోజకవర్గాల నుంచి పోటీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు సంకేతాలిచ్చారు. ఇదే సమయంలో ముఖ్యమంత్రి పదవిపై తన ఆకాంక్షను కవిత బహిరంగంగా వెల్లడించారు. తాను సీఎం కావాలని అనుకుంటున్నానని, ఆ పదవికి హుందాతనం, గౌరవం చాలా ముఖ్యమని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు బీజేపీతో రహస్య ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆరోపించారు.

## కొండా సురేఖను తొలగించారు.. పొంగులేటి సంగతి ఏమిటి?: హరీశ్ రావు

మొదటి పేజీ తరువాయి)

రహస్య ఒప్పందం ఏమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేదల పట్టా భూములను ఆదరాబాదరాగా నిషేధిత జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు.సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే... కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఏ పరిధిలోనే ఉందని, తన ఇల్లు జాబితాలో పడగానే రాత్రికి రాత్రే ఆంక్షలు తొలగించుకున్న రేవంత్ రెడ్డి... పేద ప్రజల భూములకు వచ్చేసరికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఒక్క కాగజ్‌నగర్ నియోజకవర్గంలోనే ఏకంగా 42,867 ఎకరాల రైతుల పట్టా భూములను 22ఏ జాబితాలో బందీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిషేధిత జాబితాలోని పేదల భూములను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.భూ సమస్యలపై ప్రశ్నిస్తున్న రైతులను కబ్జాదారులు అని సంబోధిస్తూ అవమానించిన రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. భూములు 22ఏ జాబితాలోకి వెళ్లడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నాయని మండిపడ్డారు. ఇది ఇందిరమ్మ రాజ్యమా లేక కబ్జాల రాజ్యమా అని నిలదీశారు.

## పెట్టుబడుల వేట.. వ్యక్తిగత అంశాలు: విజయ్ తొలి విదేశీ పర్యటనపై తమిళనాట చర్చ

వారిద్దరి మధ్య మనస్పర్థలు తొలగిపోయాయనే వార్తలు జోరుగా వినిపిస్తున్న నేపథ్యంలో, లండన్‌లో నివసిస్తున్న భార్య సంగీత, కుమార్తె దివ్యలను ఆయన ఈ పర్యటనలో కలుసుకోనున్నారని ప్రచారం జరుగుతోంది. మరోవైపు, ఇదే సమయంలో నటి త్రిష కూడా ఓ షూటింగ్ నిమిత్తం యూరప్‌లోనే ఉండటంతో సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి, రాష్ట్రంలో పెట్టుబడులు సాధించే ముఖ్యమైన లక్ష్యంతో పాటు వ్యక్తిగత జీవితపు ప్రాధాన్యతల నడుమ సీఎం విజయ్ తొలి విదేశీ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.



# వెయ్యి రోజుల పాలన.. హామీలన్నీ నీటిమూటలే!





**విజయ కెరటం నల్గొండ**

కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల విఫల పాలన నిరసన కార్యక్రమాల్లో భాగంగా, నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నేడు నల్లగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద, మహిళలు దివ్యాంగులు వృద్ధులు వంటావార్పు కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు... పలువురు మహిళా నాయకులు కార్పొరేటర్లు మాట్లాడుతూ.. మహిళలు మోసపు వాగ్దానాలు చేసిగద్దెనెక్కిన ఈ ప్రభుత్వం... అన్నిట మోసం చేసిందని, మహిళలకు 2500, దివ్యాంగులకు 6000 వృద్ధులకు 4000 విద్యార్థినులకు స్కూటీలు... ఇస్తానని మోసం చేసిందని... మాట్లాడిన ప్రతి మహిళా నాయకురాలు అనర్ఘళం గా మాట్లాడి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని ప్రభుత్వాన్ని తూర్పార పట్టారు..కంచర్ల మాట్లాడుతూ..రేవంత నకరేకల్ వస్తున్నారు ఎందుకు వస్తున్నారు..మా ప్రభుత్వం లో మంజూరి చేసిన హాస్పిటల్ ప్రారంబానికివస్తున్నారు. రేవంత్ . రేపు నకరేకల్ కు వచ్చే ముందు.... మీరు ఇస్తానన్న.మహిళలకు 2500/-వృద్దులకు 4000/ దివ్యాంగులకు 6000/- మహిళలకు కళ్యాణలక్ష్మి తులం.బంగారం.రైతులకు,కౌలు దారులకు ఎకరాకు రైతు భరోసా 15000.ఫీజు రీ అంబర్స్ మెంటు ప్రకటించి.. రావాలని కోరారు.లేకుంటే ప్రజల నిరసనను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు.రేవంత్ ప్రభుత్వం సంబంధ వర్గాల ప్రజల ఆశలను నీరు కార్చిందని, మహిళలకు 2500/-దివ్యాంగులకు 6000/-వృద్దులకు 4000/- విద్యార్థినులకు స్కూటీ లు ఇవ్వలేదని.. షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి,కి మంగళం పాడాలని చూస్తున్నాడని, కెసిఆర్ కిట్ గ్యాస్ బండ ఎగనామం పెట్టా దని అన్నారు..ఈ కార్యక్రమంలో ఇంకా రాష్ట్ర పార్టీ నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి గారు, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు కటికం సత్తయ్య గౌడ్, మాజీ ఆర్ ఓ మాలే శరణ్య రెడ్డి గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రెగట్టే మల్లికార్జున రెడ్డి .. నల్గొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి,బక్క పిచ్చయ్య సింగం రామ్మోహన్, కంచనపల్లి రవీంద్రరావు అభిమన్యు శ్రీనివాస్ సింగిల్ విండో చైర్మన్ లు వంగాల సహదేవ రెడ్డి,దోటి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కరీం పాషా, బొజ్జ వెంకటయ్య మాజీ జడ్పీటీసీ తుమ్మల లింగస్వామి జమాల్ ఖాద్రి, ఎస సమి నగర పార్టీ అధ్యక్షులు భువనగిరి దేవేందర్, ఐతగోని యాదయ్య...పల్ రెడ్డి రవీందర్ రెడ్డి, దేప వెంకట్ రెడ్డి, రావుల శ్రీనివాస రెడ్డి, సత్తయ్య సింగం లక్ష్మి, మామిడి పద్మ, కార్పొరేటర్లు, మందడి లిఖిత సైదిరెడ్డి, మారగోని ని భవాని గణేష్, దొడ్డి రమేష్ పెరిక యాదయ్య, పేర్ల మల్లీశ్వరి అశోక్, రత్నగిరి తారకమ్మ శ్రీనివాస్, కొందూరు దీపికా ప్రవీణ్ రెడ్డి,బాణావత్ దీప్లా, గోపగోని స్వాతి రాజశేఖర్.కరుణ్ జయరాజ్,కందుల లక్ష్మయ్య,మాతంగి అమర్ మండల మహిళా అధ్యక్షులు.. కొండ్ర స్వరూప, కొప్పోలు విమలమ్మ, మర్రి రేణుక, నర్రా నిర్మల,సరోజ,ఝాన్సీ, విజయరెడ్డి, బడుపుల శంకర్, వనపర్తి నాగేశ్వర్ రావు సుంకిరెడ్డి వెంకట్ రెడ్డి తోపాటు పలువురు విద్యార్థినులు, మహిళలు దివ్యాంగులు వృద్ధులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, పెద్ద ఎత్తున టిఆర్ఎస్ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

# అన్ని శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ కోరారు.





**నల్లగొండ సెప్టెంబర్ 4 విజయకేరటం ప్రతినిధి శనివారం (5.9.2026)**

రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ .రేవంత్ రెడ్డి నకిరే కల్ పర్యటన నేపథ్యంలో శుక్రవారం అయన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ , భద్రతాధికారులు, జిల్లా అధికారులతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొననున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పర్యటించనున్న ప్రదేశాలు,హెలిప్యాడ్, తదితర స్థలాలను,పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు.అనంతరం నూతన ప్రాంతీయ వైద్యశాలలోని సమావేశ మందిరంలో భద్రతాధికారులతో కలిసి ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ముందుగా భద్రత అధికారులు రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై మాట్లాడారు.అనంతరం జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో ఎలాంటి లోతుపాట్లు లేకుండా చూసుకోవాలని, ఏర్పాట్లన్ని. శు క్రవారం రాత్రిలోగా పూర్తి చేయాలని , రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా చేయనున్న శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులు వారి శాఖకు సంబంధించిన వివరాలను వెంటనే నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అలాగే వివిధ శాఖల ద్వారా ముఖ్యమంత్రి పర్యటన విధులకు కేటాయించిన ఉద్యోగుల వివరాలతో కూడిన జాబితాను ఫోన్ నెంబర్లతో సహా సమర్పించాలన్నారు. అలాగే పబ్లిక్ మీటింగ్, డయాస్, శానిటేషన్ రోడ్డుపై గుంతలు పూడ్చడం,తదితర పనులన్నీ పూర్తిచేయాలని చెప్పారు.జిల్లా ఎస్ పి శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ వివిఎం పాఠశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి దిగినది మొదలుకొని కార్యక్రమాలన్ని ముగించుకుని తిరిగి వెళ్లిపోయే వరకు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రాంతీయ వైద్యశాల, పబ్లిక్ మీటింగ్, ఇతర అన్ని ప్రదేశాలలో పోలీస్ ద్వారా జారీ చేయబడిన పాసులు ఉన్న వారిని మాత్రమే అనుమతించడం జరుగుతుందని స్పష్టం చేశారు. కాన్వాయ్,పోలీస్ భద్రత, అంబులెన్స్, వైద్య సదుపాయాలు అన్ని సిద్ధంగా ఉంచాలని చెప్పారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీలు ముందుగా వి వి ఎం పాఠశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ ను పరిశీలించి పనులు పూర్తవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు . ప్రాంతీయ వైద్యశాలలో వైద్యశాల ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు.అనంతరం రాజీవ్ గాంధీ మినీ స్టేడియంలో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించడమే కాకుండా, వివిధ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల శిలాఫలకాల ఏర్పాటు,అలాగే బారికేడింగ్ ,ఇతర ఏర్పాట్లపై తగు సూచనలను జారీ చేశారు.శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి , రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, అదనపు ఎస్పీ రమేష్, నల్గొండ ఆర్ డి ఓ అశోక్ రెడ్డి, డీఎస్పీ లు శివరాంరెడ్డి, శ్రీనివాసరావు, డి సి హెచ్ ఎస్ మాతృనాయక్ ,ఆర్ అండ్ బి, మున్సిపల్ అధికారులు, నకిరేకల్ మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్, అన్ని శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.

# కొండా దంపతుల డిమాండ్లు..? ఆ రెండు పార్టీలతో చర్చలు!

**మొదటి పేజీ తరువాయి)**

రాజకీయ చర్చలు ఊపందుకున్నాయి. పార్టీ మారే అవకాశాలపై జోరుగా ప్రచారం జరుగుతున్న వేళ.. రెండు ప్రధాన పార్టీల నేతలతో వారు జరుపుతున్న మంతనాలు ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారాయి.తమకు తగిన ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు రెండు కీలక అసెంబ్లీ స్థానాలు కేటాయించే పార్టీ వైపు వెళ్లాలనే ఆలోచనలో కొండా దంపతులు ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇందులో భాగంగా ఓ ప్రధాన ప్రాంతీయ పార్టీతో పాటు మరో పార్టీకి చెందిన ముఖ్య నేతలతోనూ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ మంతనాలు శుక్రవారం రాత్రిలోపు ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది.కొండా సురేఖపై కాంగ్రెస్ నేతలు ఎదురుదాడికి దిగారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, కుడా ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి మీడియా ముందుకు వచ్చారు. కొండా దంపతుల తీరును తీవ్రంగా తప్పుబట్టారు.మీడియా, సోషల్ మీడియాలో హైలైట్ కావడానికే అర్థరహిత విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. ఒకవైపు సొంత పార్టీ నేతల నుంచి తీవ్ర విమర్శలు.. మరోవైపు ప్రత్యామ్నాయ రాజకీయ మార్గాలపై కొండా దంపతుల మంతనాలతో వరంగల్ కాంగ్రెస్‌లో అయోమయం నెలకొంది. ఈ పరిణామాలు ఎటు దారితీస్తాయన్న దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది.



## కుడా ఛైర్‌పర్సన్‌గా గుండు సుధారాణి

### పద్మశాలి సంఘం హర్షం

**వరంగల్,విజయ కెరటం సెప్టెంబర్ 04:**



మాజీ రాజ్యసభ సభ్యురాలు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ గుండు సుధారాణిని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఛైర్‌పర్సన్‌గా నియమించడంపై వరంగల్ జిల్లా పద్మశాలి సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.పద్మశాలి సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్ నేత, ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ వద్నాల నరేందర్ నేత, జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంట్ల రాజు మాట్లాడుతూ.. తమ సామాజిక వర్గానికి చెందిన మహిళా బీసీ నాయకురాలు గుండు సుధారాణిని గుర్తించి కుడా ఛైర్‌పర్సన్‌గా నియమించడం పట్ల పద్మశాలి సమాజం సంతోషం వ్యక్తం చేస్తోందన్నారు. గుండు సుధారాణికి కుడా వంటి కీలక సంస్థకు ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు అప్పగించడం మహిళా నాయకత్వానికి, బీసీ వర్గాలకు ప్రాధాన్యత కల్పించినట్లేనని వారు పేర్కొన్నారు. ఆమె అనుభవంతో కుడా పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు మరింత ముందుకు సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అలాగే జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పద్మశాలి సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.గుండు సుధారాణికి కుడా ఛైర్‌పర్సన్ పదవి దక్కడం పద్మశాలి సామాజిక వర్గానికి గర్వకారణమని, ఆమె పదవీకాలంలో వరంగల్ ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని సంఘం నాయకులు ఆకాంక్షించారు.

## పదేళ్లు పాలించారు.. ప్రజలకు ఏం చేశారు

### “బాకీ కార్డు”తో మభ్యపెట్టొద్దు: అర్షం అశోక్

**వరంగల్ విజయ కెరటం , సెప్టెంబర్ 04:**



బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అర్షం అశోక్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ నేతలు “బాకీ కార్డు” పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. హనుమకొండ బాలసముద్రంలో శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పింఛన్లు, రాష్ట్ర ప్రజలకు ఉచిత రేషన్ సన్నబియ్యం వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి, కుటుంబ పాలన సాగించారని అశోక్ ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీల్లో దళితుడిని ముఖ్యమంత్రిని చేయడం, దళితులకు మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం వంటి హామీల పరిస్థితి ఏమైందో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.“గత పదేళ్లలో పేదలకు ఏం చేశారు? ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారా ఉచిత విద్యుత్ ఇచ్చారా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించారా” అని ప్రశ్నించారు. గత పాలనపై లెక్కలు చెప్పకుండా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు బీఆర్ఎస్ నేతలకు లేదన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని అశోక్ పేర్కొన్నారు. “బాకీ కార్డు” పేరుతో ప్రజలను మభ్యపెట్టడం మానుకుని గత పదేళ్ల పాలనపై ప్రజలకు లెక్క చెప్పాలని బీఆర్ఎస్ నేతలకు ఆయన సవాల్ విసిరారు.

## ఇనగాలను కలిసిన కుడా ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి

### మర్యాదపూర్వక భేటీ.. శుభాకాంక్షలు తెలిపిన డీసీసీ అధ్యక్షుడు

**వరంగల్ విజయ కెరటం , సెప్టెంబర్ 04:**



కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఛైర్‌పర్సన్‌గా నియమితులైన గుండు సుధారాణి, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.హనుమకొండ రామకృష్ణ కాలనీలోని ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి నివాసానికి వెళ్లిన సుధారాణి.. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ఆమెను శాలువాతో సత్కరించి, కుడా ఛైర్‌పర్సన్‌గా నియమితులైన సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.కుడా ఛైర్‌పర్సన్‌గా సుధారాణి నియామకం పట్ల హర్షం వ్యక్తం చేసిన ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి.. ఆమె పదవీకాలంలో వరంగల్ నగర అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.

## ఇరుగు వర్గాల మధ్య ఘర్షణ ముగ్గురికి గాయాలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న తిప్పర్తి పోలీసులు

**విజయ కెరటం / తిప్పర్తి :**



గంగన్నపాలెం గ్రామానికి చెందినటువంటి మర్రి నరేష్ పై సెప్టెంబర్ 2025 వినాయక చవితి సందర్భంలో గంటెకంపు మధు, మేకల శివాజీ మరికొంత మందితో కలిసి దాడి చేయడంతో తిప్పర్తి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయినది అప్పటి నుంచి నేరస్తులు అయినటువంటి గంటెకంపు మధు, మేకల శివాజీ వీరి సపోర్టర్స్ కొండేటి ప్రవీణ్ కొండేటి ప్రసాద్ అను వారితో కలిసి మర్రి నరేష్ మరియు అతనికి సపోర్ట్ చేసినటువంటి కొండేటి సతీష్, కొండేటి శ్రీకాంత్ పై కక్ష పెంచుకొని దాడి చేయడానికి.ప్రయత్నిస్తున్నటువంటి క్రమంలో తేదీ 3. 9.2026 రోజు గంగన్నపాలెం గ్రామంలో బోనాల పండుగ



సందర్భంగా కొండేటి సతీష్ కొండేటి శ్రీకాంత్, మర్రి నరేష్ మరి కొంతమందితో కలిసి పాత గ్రామపంచాయతీ ఎదురుగా మాట్లాడుకుంటూ ఉండగా నేరస్తులైనటువంటి గంటెకంపు మధు, మేకల శివాజీ, కొండేటి ప్రసాద్ కొండేటి ప్రవీణ్ అనువారు పాత గొడవలను మనసులో పెట్టుకుని కక్షపూరితంగా వారితో అనవసరంగా గొడవపడి చేతులతో కొట్టి చాకుతో దాడి చేయడంతో మర్రి నరేష్, కొండేటి సతీష్, కొండేటి శ్రీకాంత్ పొట్ట భాగంలో కత్తితో పొడిచిన గాయాలు అయినవి ప్రస్తుతం వారు ఐకాన్ ఆసుపత్రి నల్గొండ నందు చికిత్స పొందుతున్నారు అని కొండేటి సతీష్ తమ్ముడు కొండేటి మహేందర్ ఫిర్యాదు మేరకు తిప్పర్తి ఎస్ఐ ఇరుగు రవి కేసు నమోదు చేసి విచారణ చేపట్టినారు.

విజయకేరటం

తెలుగు దినపత్రిక

# కూతురి మాటలపై చర్యలు సరికాదు డీకే అరుణ

**కొండా సురేఖ బర్తరఫ్‌పై స్పందించిన ఎంపీ డీకే అరుణలి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 4:**




తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ ఎంపీ డీకే అరుణ స్పందించారు. కొండా సురేఖ సీనియర్ మహిళా నాయకురాలని పేర్కొన్న ఆమె, కాంగ్రెస్‌లోని అంతర్గత రాజకీయ విభేదాలే ఆమెను మంత్రివర్గం నుంచి బర్తరఫ్‌కు దారి తీశాయని భావిస్తున్నట్లు తెలిపారు. రాజకీయాల్లో అనేక గ్రూపులు, తగాదాలు ఉంటాయని, కాంగ్రెస్‌లో వాటిని రోజూవారీగా చూస్తున్నామని అన్నారు. 2009లో తాను, కొండా సురేఖ ఇద్దరూ మంత్రులుగా కలిసి పనిచేశామని గుర్తు చేసుకున్న డీకే అరుణ, తన తోటి మహిళా నాయకురాలు తెలంగాణకు మంత్రిగా సేవలు అందిస్తున్నందుకు సంతోషపడ్డామని చెప్పారు. ఆమెను బర్తరఫ్ చేయడం నిజంగా బాధ కలిగించిందని వ్యాఖ్యానించారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ, సీఎం ఎంతో చేశామని గొప్పలు చెప్పుకుంటారని, కొండా సురేఖ బీసీ మహిళేనని గుర్తు చేశారు. తన కూతురు ఏదో మాట్లాడిందని సురేఖపై చర్యలు తీసుకోవడం సరికాదని, సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. ఒక మహిళ రాజకీయాల్లో కష్టనష్టాలు ఎదుర్కొని ఇంతవరకు రావడం గొప్ప విషయమని అన్నారు. మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయడం సమర్థనీయం కాదని మరోసారి నొక్కి చెప్పారు. ఇప్పటివరకు బీజేపీలోకి ఆమెను ఆహ్వానించే అటువంటి చర్చలు ఏవీ జరగలేదని కూడా స్పష్టం చేశారు.

# సోనియా గాంధీ పుస్తకానికి కొత్త పబ్లిషర్.. నవంబర్ 10న విడుదల

మొదటి పేజీ తరువాయి)

పుస్తకానికి భారత్‌లో కొత్త ప్రచురణకర్త ఖరారైంది. 'హార్పర్‌కాలిన్స్ ఇండియా' ఈ పుస్తకాన్ని ప్రచురించనుంది. 2026 నవంబర్ 10న భారత్‌లో పుస్తకం విడుదల కానుంది.ఈ విషయాన్ని 'హార్పర్‌కాలిన్స్ ఇండియా' శుక్రవారం ప్రకటించింది. అత్యంత ఆసక్తి రేపుతున్న రాజకీయ జ్ఞాపకాల పుస్తకాల్లో ఇదొకటని తెలిపింది. ప్రేమ, గుర్తింపు, బాధ్యత, అనుబంధం వంటి అంశాల చుట్టూ సోనియా గాంధీ వ్యక్తిగత జీవితాన్ని ఇందులో వివరించినట్లు పేర్కొంది.ఇటీవల సోనియా గాంధీ పుస్తకానికి పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా ప్రచురణకర్త కాదని ప్రకటించింది. పుస్తకంలోని కొన్ని అంశాలపై రచయితతో చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడిందని సంస్థ తెలిపింది. అయితే సంపాదకీయ మార్పులకు సోనియా గాంధీ అంగీకరించకపోవడంతోనే పుస్తక ప్రచురణ నుంచి తప్పుకున్నారన్న వార్తలను పెంగ్విన్ ఖండించింది. బాహ్య ఒత్తిడి కారణం కాదని స్పష్టం చేసింది.'బిలాంగింగ్' పుస్తకాన్ని అమెరికాకు చెందిన ఆల్ఫ్రెడ్ ఏ.నాఫ్ నవంబర్ 10న విడుదల చేయనున్నట్లు గతంలో ప్రకటించింది. భారత్‌లో మాత్రం ప్రచురణ బాధ్యతలు ఇప్పుడు 'హార్పర్‌కాలిన్స్ ఇండియా'కు దక్కాయి. ఈ పుస్తకంలో సోనియా గాంధీ తన ఆరు దశాబ్దాల అనుభవాలను ప్రస్తావించారు. 1984లో అత్త ఇందిరా గాంధీ హత్యతో తన జీవితం ఎలా మారిందో వివరించారు. 1991లో భర్త రాజీవ్ గాంధీ హత్య తర్వాత ఎదురైన పరిస్థితులనూ పంచుకున్నారు. ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చిన తీరాన్ని పుస్తకంలో ప్రస్తావించారు. కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సుదీర్ఘకాలం కొనసాగిన సోనియా గాంధీ.. ప్రధానమంత్రి పదవిని చేపట్టే అవకాశం వచ్చినా తిరస్కరించారు. 2014లో కాంగ్రెస్ అధికారం కోల్పోయి నరేంద్ర మోదీ నేతృత్వంలోని భాజపా అధికారంలోకి వచ్చిన పరిణామాలనూ ఆమె తన పుస్తకంలో ప్రస్తావించారు.





# ప్రేమ కోసం కాదు.. పైసల కోసమే ఆ షో చేశా: రాఖీ సావంత్

దాదాపు 15 ఏళ్ల క్రితం బుల్లితెరపై ప్రసారమైన తన రియాలిటీ షో 'రాఖీ కా స్వయంవర్' గురించి ఏళ్ల తర్వాత రాఖీ సావంత్ అసలు నిజాలు బయటపెట్టారు. ప్రేమ, పెళ్లి కోసం కాకుండా కేవలం డబ్బు సంపాదించి, ఇల్లు కొనాలనే ఉద్దేశంతోనే ఆ షో చేశానని, అదంతా ఒక పెద్ద నాటకమని కుండబద్దలు కొట్టారు. ఈ షో 2009లో ప్రసారమైన సంగతి తెలిసిందే.ఇటీవల ఒక టాక్ షోలో పాల్గొన్న రాఖీ ఈ విషయాలు వెల్లడించారు. "స్వయంవరం సమయంలో నేను చాలా చిన్నదాన్ని. అప్పటికి నా ఫోకస్ అంతా బాలీవుడ్‌లో కెరీర్ నిలబెట్టుకోవడంపైనే ఉండేది. ప్రేమ, పెళ్లి లాంటి ఆలోచనలు లేవు. ముంబైలోని లోఖండ్‌వాలాలో ఒక ఇల్లు కొనాలన్నది నా కల. అప్పట్లో అద్దె ఇంట్లో ఉండేదాన్ని. అందుకే డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతోనే ఆ షోకు ఒప్పుకున్నాను" అని ఆమె వివరించారు."ఆ షోలో పాల్గొన్న వాళ్లంతా నాలాగా కెరీర్ లో ఎదగాలనే తపన ఉన్నవాళ్లే. వాళ్లను ఎవరో ఎంపిక చేసి తీసుకొచ్చారు. అది పూర్తిగా ఫేక్ షో. డైరెక్టర్, ప్రొడ్యూసర్ నాకు స్క్రిప్ట్ చెబుతుంటే, నా ఆలోచన మాత్రం డబ్బుపైనే ఉండేది. వాళ్లు ఎంత డబ్బు ఇస్తారా అనేదే నా ధ్యాస. ప్రేమ నాటకం ఆడుతూ ఆ షోలో 16 మంది అబ్బాయిలతో డేటింగ్ చేశాను" అని రాఖీ అప్పటి పరిస్థితులను గుర్తుచేసుకున్నారు. ఈ షో ఫైనల్‌లో రాఖీ సావంత్ కెనడాకు చెందిన వ్యాపారవేత్త ఎలేశ్ పరుజన్‌వాలాను తన భాగస్వామిగా ఎంచుకున్నారు. షో ముగిసిన తర్వాత వీరిద్దరికీ నిశ్చితార్థం కూడా జరిగింది. అయితే, ఆ తర్వాత వారు పెళ్లి చేసుకోకుండానే విడిపోయారు. ఇప్పుడు రాఖీ చేసిన వ్యాఖ్యలతో వారి బంధం ఎందుకు ముందుకు సాగలేదో స్పష్టమైంది.'రాఖీ కా స్వయంవర్' తర్వాత 2010లో రాహుల్ మహాజన్‌తో 'రాహుల్ దుల్హనియా లే జాయేగా' అనే మరో స్వయంవరం షో ప్రసారమైంది. ఈ షోలో రాహుల్.. డింపీ గంగూలీని ఎంచుకుని పెళ్లి కూడా చేసుకున్నారు. అయితే, వారి వివాహ బంధం కూడా ఎక్కువ కాలం నిలవలేదు. కొన్ని నెలలకే వారు విడాకులు తీసుకుని విడిపోయారు. దీంతో ఇలాంటి రియాలిటీ షోల వాస్తవికతపై మరోసారి చర్చ మొదలైంది.

# చిరంజీవి 'కాకా'.. సెప్టెంబర్ 7 నుంచి హైదరాబాద్‌లో భారీ షెడ్యూల్

**హైదరాబాద్‌లో 'కాకా' కొత్త షెడ్యూల్ ప్రారంభం**

**మెగాస్టార్, ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాల చిత్రీకరణ**

**2027 సంక్రాంతికి జనవరి 13న సినిమా విడుదల కానున్నట్లు ప్రకటన**

**ఇప్పటికే పూర్తయిన ఇంటర్వెల్ ఫైట్ సినిమాకు హైలైట్ అని టాక్**

**వాల్తేరు వీరయ్య తర్వాత చిరంజీవి-బాబీ కాంబోలో వస్తున్న రెండో చిత్రం**

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కాకా' సినిమా షూటింగ్‌పై కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రం తదుపరి షెడ్యూల్ సెప్టెంబర్ 7 నుంచి హైదరాబాద్?లో ప్రారంభం కానున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. చిరంజీవి సహా ప్రధాన తారాగణం పాల్గొనే ఈ షెడ్యూల్ సుదీర్ఘంగా, అత్యంత కీలకమని చిత్రబృందం తెలిపింది.ఈ మేరకు చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ సోషల్ మీడియా వేదికగా, "'కాకా' సెప్టెంబర్ 7 నుంచి మళ్లీ యాక్షన్‌లోకి దిగుతోంది. మెగాస్టార్ చిరంజీవి గారు, ప్రధాన తారాగణం పాల్గొనే సుదీర్ఘమైన, కీలకమైన షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది" అని పోస్ట్ చేసింది. దీంతోపాటు సినిమాను 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మరోసారి స్పష్టం చేసింది.ఇటీవలే చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన 'కాకా' టైటిల్ టీజర్?కు అద్భుతమైన స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో చిరంజీవి రావులపాలెంలోని 'అమ్మాజీ ఆక్వా ఇండస్ట్రీస్'లో సూపర్?వైజర్ సత్యంగా కనిపించారు. రొయ్యల చెరువులో పడిపోయిన తాళం చెవిని ఒక భారీ విద్యుదయస్కాంతంతో బయటకు తీయగా, దానితో పాటు తుపాకులు, ఇతర ఆయుధాలు రావడం టీజర్‌పై ఆసక్తిని పెంచింది. తాళం చెవికి ఉన్న 'ఐ లవ్ డాడ్' కీచైన్ సినిమాలో బలమైన భావోద్వేగ అంశం కూడా ఉందని సూచించింది.సినిమా వర్గాల నుంచి వస్తున్న సమాచారం ప్రకారం, ఈ చిత్రంలోని ఇంటర్వెల్ యాక్షన్ సీక్వెన్స్ అద్భుతంగా ఉండబోతోందని తెలుస్తోంది. ఇటీవల చిత్రీకరించిన ఈ ఫైట్, సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని, యాక్షన్, ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్ అంశాలు సమపాళ్లలో ఉన్నాయని చిత్రబృందం నమ్మకంతో ఉంది. ఇప్పటికే ఫస్టాఫ్ ఎడిటింగ్ పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయి. ఈ భారీ చిత్రంలో అనశ్వర రాజన్, నివేదా పేతురాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. గతంలో చిరంజీవి, బాబీ కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' బ్లాక్‌బస్టర్ విజయం సాధించడంతో 'కాకా'పై అభిమానుల్లో, సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి.



Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528